శ్రీ కథా నిలయం
GUPTA CIRCULATING LIBRARY
33/3, SAMPIGE ROAD, MALLESWARAM
BANGALORE-3.

# కొనేవాడు

బి. ఏ., పరీక్ష ఆఖరిపేపరు కూడా బాగారాసిన తరవాత రంగారావుకి నెత్తిమీద నించి కొన్ని టన్నుల బరువు తీసేసినట్టయింది. కులాసాగా ఆ సాయంత్రం షికారుకి బయలుదేరాడు. అతనికి బజారంతా కొత్తకొత్తగా కనిపించసాగింది. అధమం రోజు కోసారైనా బజారు మీదిగా పోవటం అతని కలవాటే. కాని బజారువైపు పరకాయించి సావధానంగా, సావకాశంగా చూడటమనేది అతని జీవితంలో అదే మొదటిసారి. అంతకుముందు సర్వకాల సర్వావస్థల్లో నీడలా వెంటదగిలి భయపెట్టే పరీక్షా పెనుభూతం అతనిని ఏ ఇతరవిషయాన్ని గురించీ సరిగా ఆలోచించ నివ్వలేదు. ఆ తీరికా, కోరికా కూడా అతనికి ముందెప్పుడూ కలగలేదు. ఆ రోజు రంగారావు కొత్తమనిషి. హుషారుగా నడుస్తూ కని

పించే ప్రతిదుకాణం బోర్డునీ, ఎదురయే ప్రతిమనిషినీ సావకాశంగా పరిశీలించ సాగాడు. రోడ్డుకి రెండువైపులా బారులు తీర్చిన అంగళ్లూ, వొచ్చేపోయే జనం, బళ్ళహడావుడీ— ఇవన్నీ ఏవేవో ఆలోచనలు కలిగిస్తుంటే రంగారావుకి అంతా ఏమిటో తమాషాగా కనిపిస్తోంది.

వెల్కం - ఫౌంటెన్.

GUPTA CIRCULATING LIBRARY
33/3, SAMPIGE ROAD, MALLESWARAM
BANGALORE-3.

సుస్వాగతం.

రంగురంగుల అద్దాల మీద ఆకర్షణీయంగా రాశారు. వెడితే! - టరమ్స్ క్యాష్.

నేడు రొక్కం! రేపు అరువు!

'బహుదూరపు బాటసారీ, ఇటు రావో ఒక్కసారీ', అని శ్రావ్యంగా ఎవరో పిలుస్తున్నారు—ఏదో హోటల్లోంచి. ఎందుకో? పోనీ, ఓసారి వెళ్ళి కనుక్కుంటే!

హోటల్ గడపదాకా వెళ్లాడు.

“పదార్థములు వెన్న కాచిన నేతితో తయారు. కాదని రుజువుచేసినచో రు 116 లు బహుమానం.”

హోటల్ గడపలోనే బోర్డు. భేష్! ఇవి చూడటానికే కాబోలు. 'థాంక్స్', అనుకుని ముందుకి నడిచాడు రంగారావు. ఆహ్వానం వినిపిస్తూనే ఉంది. 'డబ్బుంటే', అని సవరణ ప్రతిపాదించాడు రంగారావు తన మనసులో.

మరెవరో దయచేయమంటున్నారు.

“నో, థాంక్స్!”

నవ్వుకుని నడక సాగించాడు రంగారావు.

ఓ రెండతస్తులమేడ. పిట్టగోడ మూడువైపులా రంగు రంగుల అక్షరాలు రోడ్డుమీద పోయే జనంవైపు గుడ్లు ఉరిమి చూస్తూ వాళ్ళచూపుల్ని నిర్బంధించి బలవంతాన పైకి లాగి 'సారీ' అన్నట్టుగా చూస్తూ,

"మరేం లేదు, ఇచ్చట మీకే రకమైన పుస్తకములు కావలసినను దొరుకును'', అని సమాచారం అందచేస్తు న్నాయి.

సిటిజన్స్‌నది కాబోలు! ఎవరికి నచ్చింది వారు తీసుకో వచ్చునా? సిటిజన్స్‌కిలాంటి సదుపాయం ఉండాలిసిందే!

"బై నాలెడ్జ్ !''

విజ్ఞానం కొనండి.

కొనాలీ? సిటిజన్స్ సొంతం కాదూ?

నవ్వాపుకోలేక బయటికి నవ్వేశాడు రంగారావు. దగ్గరగా ఉన్న ఇద్దరు ముగ్గురు అతనివైపు వింతగా చూశారు. అతను గబగబ ముందుకి నడిచాడు.

మళ్ళీ ఏదో హోటల్. పెద్ద పెద్ద అక్షరాలతో రాశారు.

"మీ తృప్తే మా ఆశయం."

"సంతోషం !'' అనుకున్నాడు రంగారావు.

"వెల స్వల్పం, ఫల మధికం".

ఓసారి తను ఇక్కడ తిన్న పెసరట్టు తనచేత డాక్టర్‌కి పది రూపాయలు ఫీజు ఇప్పించింది. చరచర ముందుకి సాగాడు రంగారావు.

"చెప్పుల్లేకుండా పోతున్నారా? అయ్యో", అని పరామర్శించి "ప్రమాదంసుమా!" అని హెచ్చరిస్తోంది ఓ బోర్డ్. నిజమే. ఓసారి ఓ జోడు తన పాదాల్ని తెగకరిచి రెండు రోజులు ఇంట్లో మూలపడేసింది తనని. నవ్వొచ్చింది రంగారావుకి. ఎక్కడ చూసినా, ఎటు చూసినా ఈ ఆధునిక ఫలకాలు ఇంతింత అక్షరాలతో వికృతంగా కనిపిస్తున్నాయి. తను ఐదో క్లాసు చదివేరోజులు జ్ఞాపకం వొచ్చాయి రంగారావుకి. టీచర్ ఇచ్చిన లెక్కల్ని తాటికాయల్లాంటి అక్షరాలతో, అంకెలతో గబగబా రాసుకుని, నిమిషాలమీద ఇష్టం వచ్చినట్టు చేసేసి, టీచర్ దగ్గరికి పరిగెత్తి ఒకరి పలక మీద మరొకరు పలక పోటీపెట్టి ఆయనకి ఊపిరాడకుండా "ముందు నా లెక్క చూడండి సార్", అని కుర్రాళ్లు గొడవ చెయ్యటం రంగారావుకి బాగా జ్ఞాపకం. ఈ బోర్డు లన్నీ చిన్నపిల్లల పలకల్లా కనిపించాయి అతనికి. నవ్వుకున్నాడు.

ఈ అక్షరా లన్నీ—పచ్చవీ, ఎర్రవీ, తెల్లవీ—పరస్పరం ఎల్లప్పుడూ అనుమానంగా, ఈర్ష్యగా, కోపంగా చూసుకుంటూనే ఉంటాయి కాబోలు ననుకున్నాడు రంగారావు.

ఎంపోరియంలూ, షాప్‌లూ, హౌస్‌లూ, కంపెనీలూ దాటిపోతున్నాయి.

వెరైటీ క్లాత్!
న్యూ వెరైటీ క్లాత్!
నియో మోడరన్ టెక్స్‌టైల్స్!
బ్యూటిఫుల్ పీస్‌గుడ్స్!

స్వదేశీ!

సిల్కు!

రకరకాల్లో ప్రత్యేకత.

ప్రత్యేకతలన్నీ ప్రత్యేకంగా చూస్తున్నాడు రంగారావు, రోడ్డుమీదనించే. అతనికో విషయం హఠాత్తుగా తట్టింది. తనకిమల్లేనే ఇంకా ఎందరో అలాగే చూస్తున్నారు. పోతున్నారు. వాళ్ళేమనుకుంటున్నారో! కొందరి కళ్ళలో ఆశలు ప్రతిఫలిస్తున్నాయి. కొందరి కళ్ళలో నిస్పృహ! ఖరీదైన వస్తువులుండే కొట్లవైపు చూసీ చూడగానే పొరపాటుగా తప్పుపని చేసినట్లు కొందరు వెంటనే కళ్లు పక్కకి తిప్పేసుకోటం చూసి రంగారావుకి ముల్లు గుచ్చుకున్నట్టయి వాళ్ళవైపు జాలిగా చూశాడు. మరోవిషయం రంగారావుకి వెంటనే తట్టింది. అంగళ్ళ యజమానులు రోడ్డుమీద పోయే జనంవైపు అర్థంకాని చూపులతో ఏమిటో వెతుక్కుంటున్నట్టుగా చూస్తున్నారు. చాలామంది జనం మాత్రం ఎవరిదారిన వాళ్లు పోతున్నారు. ఇది అంత మర్యాదకరంగా తనకే కనిపించటం లేదు. ఇహ కొట్లయజమానులసంగతి చెప్పాలా? పిలిచిన పేరంటానికి పోకుండా ఉండకూడదు! ఆ భాష రంగారావు కర్థమౌతోంది. స్వాగతమండీ, స్వాగతం!! వినిపించుకోరేం, మర్యాదగా పిలుస్తుంటే! మీతృప్తే మా ఆశయం. ఒకసారి దయచేసిన మీకే తెలియగలదు.

ఇదే దారి...అది కాదు.

ఇటు—ఇటు.

అటు కాదని వేరే చెప్పక్కర్లేదు. క్వాలిటీ అక్కర్లేదూ? రండి! రండి! ఓహోహో! రాజాధి రాజా, మార్తాండ తేజా!

ఎవరు రాజు!

నవ్వొచ్చింది రంగారావుకి. కాని వెంటనే అతని మనసులో చదువుల సరస్వతి ప్రత్యక్షమై జవాబిచ్చేసింది.

పెట్టుబడిదారీ వ్యవస్థలో కొనేవాడే రాజు.

*'Under Capitalism consumer is the king.'*

రాజు! ఈ బజార్లో నడుస్తున్న జనులందరూ రాజులే. తనూ!

బలే నినాదం! బావుంది! అద్భుతం!

తను దుకాణం పెడితే ఇదే తన నినాదం. కాని వొద్దు...వొద్దు. చూస్తూ చూస్తూ రాజ్యం త్యజించటం సామాన్యమైన విషయం కాదు!

స్వేచ్ఛగా ఇష్టం వచ్చినట్టు సంచరిస్తున్న మనసుని అరికట్టి నడుస్తున్నాడు రంగారావు.

బ్యూటిఫుల్ టెక్స్టయిల్స్ గల తన మిత్రుడున్నాడు. ఓసారి విజిట్ చెయ్యటం ధర్మం. ఆ షాపు పెద్ద బిల్డింగులో ఓమూల ఉంది. అరడజన్ కొట్లు దాటిపోవాలి. నెమ్మదిగా ప్రతికొట్టూ పరిశీలిస్తూ నడుస్తున్నాడు రంగారావు.

"ఏంకావాలండీ?"

అందరూ ఆతృతగా అడుగుతున్నారు.

"ఏమీ వొద్దు."

GUPTA CIRCULATING LIBRARY
33/3, SAMPIGE ROAD, MALLESWARAM
BANGALORE-3.

ఒద్దనిపించుకోటంతో కొంచెం చిన్నతనంవేసి ముఖం పక్కకి తిప్పుకుంటున్నారు—షాపుల్లోవాళ్లు. తన మిత్రుడు ఖాళీగా కూర్చున్నాడు. "ఏం గుప్తా", అన్నాడు. అతడు కొంచెం ఉలిక్కిపడ్డట్టు చూసి "ఏరోయ్", అన్నాడు. నిజానికి నిన్నకాక మొన్నే ఏవో షర్టింగులూ, కోటింగులూ తీసుకున్నాడు. మళ్లీ ఇవాళే తన కేం అవసరం వొచ్చిందబ్బా అని ఆశ్చర్యపడుతున్నట్టున్నా డనుకున్నాడు రంగారావు.

"ఏం కావాలి?"

ఈ ప్రశ్న వినగానే రంగారావుకి వొళ్లు మండింది. అదేం ప్రశ్న? స్కూల్ ఫైనల్ దాకా కలిసి చదువుకున్నారు గదా! "ఏమిటి సంగతులు?" అని అడగకూడదూ? ఏం కావాలిసొస్తుంది తనకి ప్రతిరోజూ! మళ్లీ అడిగాడు గుప్తా మర్యాదగా "ఏంకావాలి?" అని. వెంటనే రంగారావుకి తన రాజరికం జ్ఞాపకం వొచ్చింది. కాని ఏం అడగాలో తెలియలేదు. ఏమీ తోచక "చీర లున్నాయా?" అన్నాడు. "ఉన్నాయా?" అని అడగటమేమిటి, ఎదురుగా బీరువాల్లోంచి వందలకి వందలు కనిపిస్తుంటే! చీరలు అనేమాట వినేసరికి గుప్తాకి కొంచెం ముఖం వికసించింది. ఫరవాలేదు—కాస్త గిరాకీ అన్నమాటే. అతని కా సంతోషం కలిగించినందుకు రంగారావుకి సంతోషంగానే ఉంది. కాని...

"ఏం చీరలు కావాలి? బాంబేప్రింటెడ్, ఫారిన్ ప్రింటెడ్ వాయిల్స్, జార్జెట్, షిఫాన్, బెనారస్‌సిల్కు, బెంగుళూరుసిల్కు, ఆర్గండీ, ఇమిటేషన్ ఆర్గండీ, క్రేప్", ఏమేమిటో చెప్పుకుపోతున్నాడు. రంగారావుకి పచ్చి వెల

క్కాయ నోట్లో పడ్డట్టయింది. తనీ పేర్లుకూడా సరిగా వినలేదింతవరకూ, ఏం చెప్పాలి? గుప్తా చెప్పిన మొదటిపేరు జ్ఞాపకం పెట్టుకొని “బాంబే ప్రింటెడ్ చూపించు”, అన్నాడు. అనడమే తడవుగా షాపులోని కుర్రాళ్ళూ, గుప్తా కలిసి గబగబ బీరువా తలుపులు లాగేసి చీరలు బల్లమీద పరవటం మొదలు పెట్టారు. రంగారావుకి అయోమయంగా ఉంది. ఊరుకున్నవాడు ఊరుకోక అనవసరంగా కావాలని చిక్కు తెచ్చుకున్నాడు. పాపం, వాళ్లు శ్రమపడి అవన్నీ చూపిస్తుంటే, బెల్లంకొట్టినరాయిలా అలా చూస్తూ నించోటం ఘోరం అనిపించి “అవన్నీ ఒద్దులే” అన్నాడు కాని గుప్తా ఆ మాట లేమాత్రం సరుకుచేయక, “ఫరవాలేదులే చూడు,” అన్నాడు. యంత్రంలా రంగారావు పరీక్షిస్తున్నట్టుగా ప్రతిచీరా స్పృశించి చూస్తున్నాడు. అతనికి ముచ్చెమటలు పడుతున్నాయి. చీరలు కుప్పలుకుప్పలుగా బల్లమీద పడుతున్నాయి. తను ఏదీ కొనబోవటంలేదు. “ఈ గుప్తాకి చీరలు కొనే అవసరం తనకింకా రాలేదనే విషయం తెలియదేం? వెధవవ్యాపారం, వీడూ”, అని విసుక్కున్నాడు. కొంపతీసి తనని బాగా ఎరిగినవాళ్ళెవరైనా చూస్తే అదో తంటా! “పెళ్ళికాకుండానే నీకీ చీరలగొడవేమిటిరోయ్?” అని ఠకీమని అనేశారంటే పరువుకాస్తా పోతుంది. గుప్తా తనని ఎన్ని శాపనార్థాలు పెడతాడో, ఏదీ కొనకుండా పోతే.

“అంతగా నచ్చలేదు. వొస్తా”, అని లేవబోయాడు రంగారావు. కాని గుప్తా వదల్లేదు. ఇంకా ఏవేవో చూపిస్తున్నాడు. ఈసారి కాస్త వాళ్ళమండి, “ఎందుకురా? ఇవన్నీ

చూపించక్కర్లేదు. వొచ్చిన ప్రతివాడికీ ఇంత శ్రమపడి మళ్లీ చచ్చినట్టు మడతలు పెట్టుకొంటావా ఏం?" అన్నాడు. గుప్తా ఏమీ విసుక్కోక "మరి లేకపోతే అమ్మకం ఎలా జరుగుతుంది?" అన్నాడు. రంగారావు కొంచెం ఆశ్చర్య పడి "ఇలా రోజు కెన్నిసార్లు ఈ ప్రదర్శన జరుగుతుంది?" అన్నాడు.

"నీలాంటివాళ్లు ఎంతమంది వొస్తే అన్నిసార్లు".

"ఏమైనా దెబ్బకొట్టాడా?"అనుకున్నాడు రంగారావు.

"సరే ఇహ వస్తా."

"కొనకపోతే మానే. అన్నీ చూసిపో," బలవంతం చేశాడుగుప్తా. గుడ్లప్పగించి చూశాడు రంగారావు. ప్రదర్శనానంతరం "సారీ", అని మాత్రం అనేసి వెనక్కి తిరిగాడు.

"థాంక్యూ."

ఎదురుగా బోర్డు ఉంది.

రంగారావు ముఖం జేవురించింది.

ఓసారి వెనక్కి తిరిగి గుప్తాముఖం చూస్తే— రంగారావుకి సాహసం కలగలేదు. ఎన్ని తిట్టుకొంటున్నాడో! "థాంక్యూ!"అని గుప్తా ఎబ్బెట్టుగా అన్నట్టుగానే ఉంది అతనికి. కొట్టు దాటిరాగానే పక్కకొట్లవాళ్ళు రంగారావు ప్రవర్తని సి. ఐ. డీ. ల్లా కనిపెట్టి సమయంకోసం కాచుకు కూచున్నట్టుగా ఒకరి తరవాత ఒకరు "మంచి మంచి కొత్త వెరైటీ చీర లున్నాయి. చూస్తారా?" అని ఆదుర్దాగా అడగసాగారు.

రంగారావుకి కాళ్లు వొణికాయి. ఇంకా కాసేపు అలా నిలబడితే బలవంతాన తనని లాక్కుపోయి తమ తమ నమూనాలు ప్రదర్శించి బాధించగల రని భయంవేసి గబగబ ముందుకి నడిచి బయటపడ్డాడు. తను వ్యాపారం పెడితే వస్త్రాలయం మాత్రం జన్మలో ప్రారంభించటం జరగదు.

కథా నిలయం
శ్రీకాకుళం

మళ్లీ బోర్డులు—రకరకాలు.

జనరల్ స్టోర్స్!

ఫ్యాన్సీ స్టోర్స్!

రంగారావుకి ఏదో వెలితిగా కనిపించింది. ఆలోచించగా జ్ఞాపకం వొచ్చింది. అక్కడో ఫేమస్ ఫాన్సీ షాప్ ఉండాలి. ఏమయింది? కనిపించదేం? నిన్నకాక మొన్న చూశాడే! డేరా మేకు పీకేశాడన్నమాట. అసలే చిన్న షాపు. ఎవరూ కొనటంలేదు కాబోలు. రంగారావు వెంటనే ఇంకో విషయం కనిపెట్టాడు. మై ఫాన్సీ—విస్తరించింది. మొదట ఈ రెండు షాపులకీ మధ్య ఇంకేవో చిన్న చిన్నవి రెండు మూడు షాపు లుండేవి. వాటన్నిటిని క్రమంగా మై ఫాన్సీ—కబళించి వేసింది. ఇప్పుడు ఫేమస్ షాప్ కూడా అదృశ్యం. 'ఇంతింతై వటుడింతయై...' అన్న పద్యపాదం స్ఫురణకి వచ్చింది రంగారావుకి. ఎవరో బాగుపడ్డందుకు సంతోషం. మూడుపువ్వులూ ఆరుకాయలూ. అదే కావలసింది. కాని ఎవరో బాగుపడలేకపోవటం దురదృష్టం. శోచనీయం. ఏమిటో ఆలోచిస్తూ కొట్టుముందు నుంచున్నాడతను.

రంగారావు వైఖరి చూసి కొట్టు యజమాని బిగ్గరగా ఓ కేక పెట్టాడు.

GUPTA CIRCULATING LIBRARY
33/3, SAMPIGE ROAD, MALLESWARAM
BANGALORE-3.

"ఏం కావాలండీ ?"

రంగారావు పరిస్థితి గ్రహించి మాట్లాడకుండా ముం దుకి వెడితే జనం తనవైపు ఆశ్చర్యంగా చూస్తారనీ, కొట్లో యజమాని నిరాశగా చూస్తాడనీ అనుమానించి కొట్లోకి వెళ్లాడు.

"ఎన్నాళ్ళ కెన్నాళ్ళకి దర్శనభాగ్యం!" అన్నట్టు కొట్టు యజమాని చిరునవ్వుతో "ఏం కావాలండీ?" అని అతి మర్యాదగా అడిగాడు. రంగారావుకి తన రాజరికం వెంటనే స్ఫురించగా కొంచెం దర్జాగా కొట్టు నాలుగు మూలలూ చూసి "షాపు పెద్దది చేశారే!" అని మెచ్చు కుంటున్నట్టుగా అన్నాడు. ఆయన నవ్వి "తక్కువ లాభం, ఎక్కువ అమ్మకం. అదే మాలక్ష్యం, మా పాలిసీ. అందుకే మీలాంటివాళ్లు మాకొట్టుకి రావటం", అన్నాడు. రంగారావు మనసులో "మా తృప్తే మీ ఆశయం" అనుకొన్నాడు.

"మీ కేం కావాలి ?"

ఏం అడగాలో రంగారావుకి తోచలేదు. తన కేమీ అక్కర్లేదు.

"ప్రస్తుతం ఏమీ వొద్దులెండి. ఊరికే చూసిపోదా మని వొచ్చాను." అనాలనుకున్నాడు, గాని అలా అంటే మున్ముందు తనని లక్ష్యపెట్టడేమోనని "టాయ్‌లెట్ సామగ్రి ధర లెలా ఉన్నాయి?" అన్నాడు.

ఆ షాపు యజమాని వెనువెంటనే తడుముకోకుండా అనర్గళంగా టకటక చెప్పేస్తున్నాడు. ఒక్కొక్క వస్తువూ, ఆ వస్తువు తను ఎంత ధర కమ్ముతున్నదీ, ఇతరు లెలా అము

తున్నదీ, కావాలంటే కనుక్కోవచ్చు నని అభయంకూడా ఇస్తున్నాడు.

రంగారావు మాత్రం అత్యాశ్చర్యంగా అతనివైపు చూడసాగాడు. అద్భుతధారణశక్తి అతనికి దిగ్భ్రిమ గొల్పుతోంది. తనకొట్లో అమ్మేధరలే కాక ఇతరులవి కూడా అద్భుతంగా జ్ఞాపకం ఉంచుకుని లిస్టుల సహాయం ఏమాత్రం లేకనే టకటక వరసక్రమంగా చెప్పేయటం చూస్తే, ఈ మానవుడు కాలేజీ చదువు కొనసాగిస్తే యూనివర్సిటీ ఫస్టు మాత్రమే కాక రికార్డులు పగలకొట్టించేవాడని కూడా నిస్సందేహంగా చెప్పొచ్చు అనిపించింది రంగారావుకి. కాని ఆ ఆశ్చర్యం క్రమంగా భయంలోకి దిగింది. ఇంతావిని తుస్సున వెళ్ళిపోతే అనర్గళంగా శాపనార్థాలు ఒక్కుమ్మడిగా రావొచ్చు. అయితే అదృష్టవశాత్తూ, ఆ యజమాని ఓ చిన్న పొరపాటు చేశాడు. కావాలిస్తే ఇతరచోట్ల ధరలు విచారించి తన ధరలు తక్కువగా ఉంటేనే కొనొచ్చు అన్నాడు. ఈ అవకాశం వెంటనే సద్వినియోగం చేసుకుని "విచారించి వొస్తానండి", అనేసి అప్పటి అవస్థనించి తప్పించుకొన్నాడు. ఎదురుగా ఉన్న ఫాన్సీకొట్ల యజమానుల కళ్ళన్నీ రంగారావుని వెంబడించాయి. రంగారావుకి కొద్దిగా భయం వేసి గబగబ నడిచాడు.

మందులు! మెడికల్ లైన్!

ఇంగ్లీషుమందులు, ఆయుర్వేదౌషధాలు, హోమియో మందులు, వరసగా బీరువాల్లోంచి సీసాలు తొంగి చూస్తున్నాయి.

రంగారావు భయంగా ఆ తెల్లటి అక్షరాలవైపూ, సీసాలవైపూ, ఆ కొట్ల యజమానులవైపూ చూశాడు. మెడికల్‌షాపుల్ని చూస్తే వాసనాపూర్వకమైన అదో భయం అతనికి చిన్నప్పటినించీ. మందులవాళ్లు కంపెనీల యజమాన్లు జనంవైపు చూస్తూ ఖాళీగా కూచోటం ఎల్లప్పుడూ వాంఛనీయం అనుకున్నాడు రంగారావు, భయగ్రస్తుడై. తనవైపు ఎవరో దుకాణదారుడు చూస్తున్నాడు. తన చేతిలో చీటీ ఏమీలేదు అదృష్టవశాత్తూ. గాడ్ ఫర్‌బిడ్ ! మందు లెక్కువైతే మరణా లెక్కువ అని ఓమిత్రుడు చమత్కరించాడు ఆ మధ్య. 'కాదు ఆస్పత్రు లెక్కువయితే', అని తను సవరించాడు చమత్కారంగా. ఎవరికో కీడు జరిగి మందుల అమ్మకం—— కావాలని వాంఛించకపోయినా – వృద్ధికావటం ఘోరం అనిపించిందతనికి. ముందు కీడు జరిగితేనే తరవాత మందులు కొనటం జరుగుతుందని రంగారావు ఆ క్షణంలో ఆలోచించటానికి సిద్ధంగా లేడు. డబ్బిచ్చి పెట్టుబడిమీాద లాభాలు ఊరికే తీసుకోమన్నా తను మందులషాపు మాత్రం కలలోకూడా పెట్టడు ! రంగారావు నడుస్తూనే ఉన్నాడు.

కొత్త కొత్త సంగతులు—ఇదివరకెప్పుడూ సూచనగానైనా తను అనుకోనివి—ఎన్నో అనుభవానికి వొస్తున్నాయి.

ప్రకటనలు ...

ధరలు...

తగ్గింపురేట్లు...

అంతకంటె తగ్గింపురేట్లు.

మీ రెక్కడ కొనాలో ఏం కొనాలో మీకు తెలి యదు...మా సలహా పొందండి. సలహా ఉచితం.

రంగారావు తల తిరుగుతోంది.

పోటీ—పోటీ—పోటీ.

ఎక్కడ చూసినా పోటీ—ఎటుచూసినా పోటీ.

తను అక్కర్లేనివి అనవసరంగా బేరంచేశాడు. బేరం చేస్తున్నంతసేపూ శీవి. వెనక్కి తిరిగితే— "థాంక్యూ!" రంగారావుకి అపహాస్యంగా గుప్తా థాంక్యూ అన్నట్టని పించింది.

అవును, మరి. కొనేవాడే రాజు. డబ్బిచ్చేవాడే మహా రాజు. చిరునవ్వుతో ప్రతిఫలంగా కృతజ్ఞతాభివందనాలు. ఎంత నిరీక్షణ! ఎంత ఆశ! ఎన్ని ఆకర్షణలు!

రోడ్డుమీద జనం నడుస్తున్నారు. నడుస్తున్న జనాన్ని చూసి దుకాణదారులు ఆశపడుతున్నారు. జనం ఆశగా వస్తువులవైపు చూస్తున్నారు. తీసుకోమని బతిమాలు తున్నట్టుగా యజమానులు కళ్ళతో వాళ్ళని పలకరిస్తు న్నారు. ఒకే ఒక్క వస్తువు ఇద్దర్నీ—ఇరుపక్షాలవాళ్ళనీ—అడ్డ గిస్తోంది. డబ్బు! 'వెధవడబ్బు', అనుకున్నాడు రంగారావు. గవర్నమెంటు ముద్రకొట్టించి పారెయ్యకూడదూ? వెంటనే నవ్వొచ్చింది రంగారావుకి. తన ఆర్థికశాస్త్రవిజ్ఞాన మంతా ఏమయినట్టు? పరీక్షలో ఏకరువు పెట్టిన ద్రవ్యోల్బణ ప్రమాదాలన్నీ మళ్ళీ గుర్తుకొస్తున్నాయి. అవన్నీ జ్ఞాపకం చేసుకుని మళ్ళీ ఆ యాతన అనుభవించటానికి అతడు సిద్ధంగా లేడు. కాని అతని మనసులో ఏదో బాధగా ఉంది. పోనీ,

ఉన్నవన్నీ తలాకాసినీ పంచుకోగూడదూ? పంచుకుంటే ప్రతివాడికీ దక్కేది ఏమిటో తనకి తెలియకపోలేదు. ఉత్పత్తి! ఉత్పత్తి ఎక్కువకావాలి. అందాకా ఏంచేసేట్టు! ఉన్నదేదో ఎంత కొద్ది అయినా అందరూ పంచుకోటమే న్యాయమని పిస్తుంది రంగారావుకి. అవన్నీ చిక్కువిషయాలు. ప్రస్తుతం తను అవన్నీ ఆలోచించే స్థితిలో లేడు. మనసు తిప్పుకున్నాడు రంగారావు.

కోనేవాళ్లు బేరాలు చేస్తున్నారు.

తనలాంటి కోనేవాళ్లు కాదుగదా!

తను దుకాణదారుడైతే!

రంగారావుకి ముచ్చెమటలు పట్టాయి. తన వల్ల కాదు. వొచ్చిన ప్రతివాడికీ ఓ నమస్కారం పెట్టేసి వొది లించుకుంటాడు. అలా అయితే అమ్మకం జరగదు. అమ్మకం జరక్కపోతే డబ్బురాదు. డబ్బురాకపోతే—? తన రాజరికం నశిస్తుంది.

అకస్మాత్తుగా రంగారావుకి ఓ ఆలోచన కలిగింది. దుకాణదారులూ కొనేవాళ్ళే. ప్రపంచంలో ప్రతిమనిషీ కొనేవాడే.

పెట్టుబడిదారీవ్యవస్థలో ప్రతివాడికి రాజయోగం ఉంది. రాజయోగం! అందుకోసమే ఈ నిరీక్షణ. ఈ వేడికోలు. ఈ ఆశ!

"రండి రండి రాజులూ, కొనండి, కొనండి." అంటున్నారు యజమానులు.

సర్వం హాస్యాస్పదంగా కనిపించింది రంగారావుకి ఒక్కక్షణం.

ఆలోచిస్తూ నడుస్తూనే ఉన్నాడు రంగారావు.

ఎవరో కాఫీహోటల్ ముందు తచ్చాడుతున్నారు. ఎవరు? ఓ! తనకి తెలిసినవాడే. ఎలిమెంటరీస్కూల్ టీచర్. ఏమిటి ఆలోచిస్తున్నాడు? కాఫీ తాగుదామా వద్దా అని కాబోలు. 'కొనవయ్యా అరకప్పుకాఫీ', అని హోటల్ యజమానితరఫున రంగారావు మనసులో విసుక్కున్నాడు. కాని ఆ టీచర్ కాసేపు అలాగే సంకోచించి, చివరికి ఎదురుగాఉన్న మల్లెపూల అంగడిలో ఓ బేడా పువ్వులు తీసుకుని వెనక్కి వెళ్ళిపోయాడు. రంగారావుకి హృదయంలో కలుక్కుమంది. పాపం! డబ్బుల్లేవు కాబోలు. భార్య గడుసుదై ఉండాలి. మాట జవదాటటానికి జడిసి ఉంటాడు. తనో అరకప్పు కాఫీ ఇప్పిస్తే బావుండేది!

ఆలోచనలతో నిండిన రంగారావుమనసుని మరో దృశ్యం తనవైపు లాక్కుంది. ఎన్. జి. ఓ. అని చెప్పకనే చెబుతున్న వాలకంగల ఓ పెద్దమనిషి చిన్నపిల్లవాడిని నెమ్మదిగా నడిపించుకుంటూ ఓ దుకాణం దగ్గర ఆగి అర ప్యాకెట్ 'సిజర్' సిగరెట్లు అడిగాడు. కాని ఇంతలో ఆ పిల్లవాడేదో కావాలని చెయ్యిపెట్టి చూపిస్తూ మారాం చెయ్యసాగాడు. ఆ ఎన్. జి. ఓ. ఒక్కక్షణం తటపటాయించి జేబులు తడుముకుని చిన్న నవ్వు తెచ్చుకుని సిగరెట్లు అక్కర్లేదని చాక్లెట్లు తీసుకుని పిల్లవాడి చేతిలోపెట్టి, చుట్టూ

జనం ఉన్నారని కూడా సందేహించకుండా వాడిని హృదయాని కదుముకుని ముందుకి సాగిపోయాడు.

రంగారావు ఒక్కక్షణం తనెక్కడున్నాడో మర్చిపోయి రోడ్డుమధ్యగా కదలకుండ నిలబడ్డాడు. ఇంతలో పోలీస్‌విజిల్ విని తేరుకుని ఆ దృశ్యం జ్ఞాపకం చేసుకోసాగాడు. అతని హృదయంలో ఏదో వేదన మెదిలింది. మనసులోనే ఎస్. జి. ఓ. కి సానుభూతి అందజేశాడు రంగారావు.

ఆ విషయంగురించి ఎక్కువసేపు ఆలోచించాలిసిన అవస్థ రంగారావుకి తప్పిపోయింది. నాలుగడుగులు వెయ్యగానే మరో విశేషం అతని దృష్టిని ఆకర్షించింది. అప్పుడే అంగడిలో అడుగుపెట్టి ఓ పెద్దమనిషి చేతిలో ప్యాకెట్‌విప్పి బల్లమీద పడేస్తూ "ప్రస్తుతం చీర అవసరం లేదులెండి. ధోవతులు చూపించండి," అంటున్నాడు. చీరలు అమ్మినవి వాపసు తీసుకోవటం కొట్టు యజమానికి కొత్త కాకపోయినా ప్రస్తుత పరిస్థితి అతని కేదో కొంచెం వింతగా కనిపించి నట్టుంది; కొంచెం ఆశ్చర్యంగాచూసి ఏమీ మాట్లాడకుండానే ధోవతులు చూపించసాగాడు. ఐతే రంగారావుకి మాత్రం అదేమీ విషమసమస్యగా కనిపించలేదు. ఆ పెద్దమనిషి కట్టుకున్న ధోవతి అనబడేది ఆ సమస్యను త్వరితంగానే పరిష్కరించింది. ఆయన శ్రీమతి కేదో పురస్కారం ఏదో సందర్భాన ఇవ్వాలని ప్రయత్నించి ఆర్థికస్థితి అందుబాటులో లేక కాలం కలిసిరానందువల్ల అవసరాలు వాయిదా వెయ్యలేకపోయాడు. 'పాపం', అనుకున్నాడు రంగారావు.

అవసరాలు వాయిదా పడవు.

"నిజం, నిజం" అనుకున్నాడు రంగారావు.

అందరూ సుఖపడితే బాగుండును.

"సుఖదుఃఖాలు కావడికుండలు", అని జ్ఞాపకంవొచ్చిం దతనికి. "అంతేలే," అనుకున్నాడు. తనకి కొంచెం వేదాంతం అబ్బుతోంది. చిన్నగా నవ్వుకుని జనప్రవాహాన్ని దాటు కుంటూ నడుస్తున్నాడు రంగారావు.

ఒక్కసారిగా రంగారావు హృదయం ఝల్లుమంది. కళ్లు జిగేల్ మన్నాయి. మెరుపు మెరిసినట్టయింది.

"ఖటావ్ వాయిల్స్."

ఓ అందమైన అమ్మాయి అందంగా చీరకట్టుకుని నిలబడ్డది నాజూకుగా, వొయ్యారంగా.

అది బొమ్మే! కేవలం రంగులకలయికే నని రంగారావు వెంటనే నమ్మినా నమ్మలేకపోయాడు. ఆ బొమ్మని అతడు చూడడం అది మొదటిసారి ఎంతమాత్రం కాదు. అయినా ఆ రోజు అది అతనికి ఎంతో కొత్తగా, తాజాగా, అందంగా, సజీవంగా, ఇంకా ఇంకా ఏమిటోగా కనిపించసాగింది.

ఆ చీర ఎంత బావుంది! చీర బావుందా? ఆమె కట్టుకోవటంలోని నాజూకుతనం బావుందా? లేక ఆమె – ఆ బొమ్మ అందమే చీర బావుందనిపిస్తోందా? చీర ఎలా కట్టు కుంటారో కూడా రంగారావుకి తెలియదు. ఆ మెళుకువ లన్నీ చూస్తుంటే ఇన్నాళ్ళనించీ తను ఆ సుందరదృశ్యాన్ని ఎలా చూడలేకపోయాడో రంగారావుకి అవగతం కావడంలేదు.

చూచినకొద్దీ తనకి చూడాలనిపిస్తోంది. ఆ చిత్రకారు డెవరో గొప్పవాడు. జీవకళ ఉట్టిపడుతోంది.

అలా తన్మయత్వంతో చూస్తున్న రంగారావుకి అకస్మాత్తుగా అనిపించింది: తన నా స్థితిలో ఎవరైనా చూస్తే బావుండదు. తెలియనివాళ్ళయితే నవ్వుకుంటారు. తెలిసినవాళ్ళయితే ఏడిపిస్తారు. సజీవంగా నడిచే అందమైన అమ్మాయిల్ని తను ఇదివరలో చూడకపోలేదు. చిత్తచాంచల్యం తాత్కాలికంగా కలగక పోలేదు. కాని ఇప్పుడదేదో భావం హృదయంలో కలుగుతోంది. అదే భావంతో హృదయం నిండిపోతోంది. ఏదో రసవాహిని ప్రవహిస్తోంది. వాయిల్ చీర బావుంటుంది కాబోలు!

కాని గుప్తాకొట్లో చూస్తే తనకేం నచ్చినట్టులేదే! తమతమ నెలవులు దప్పిన—! అనవసరంగా తను అక్కర్లేని బేరాలు చేశాడు. గుప్తా ఏమనుకున్నాడో!

అకస్మాత్తుగా రంగారావుమనసులో మెరుపులా ఓ ఆలోచన మెరిసింది.

తనూ ఎప్పుడో కొనాలి! కోంటాడు – చీరలు. రంగారావు హృదయం పరవశించింది. ఆ ప్రణయ బహుమానాలు మనసులో మెదలుతున్నాయి. ఆనంద తరంగాల్లో తేలిపోతూ అతడు ముందుకు నడిచాడు.

నవరత్నాలు రాలేలా నవ్వుతూ పసిపాప పలకరించింది, ఎదురుగా కాన్వాస్ మీద తిరిగ్గా కూచుని. జల్లుమంది రంగారావు హృదయం. రెండోసారి రెండోమాదిరిగా. ఆ

బోసినోటితో నవ్వే పసిపాప పక్కన ఉన్న అక్షరాలు చది వాడు రంగారావు.

"అమ్మా, నీకు తెలిసియుండలేదా ?" ఏదో ప్రకటన. ఐనా రంగారావు హృదయం ప్రఫుల్లమైంది. హృదయంలో ఏదో ఆవేశం ఉబికింది. పక్కనే ఉన్న ఆటవస్తువుల వైపు కోరికగా చూశాడు. ఆ క్షణంలో తన్ను తాను మర్చి పోయిన రంగారావు ఇంచుమించు ఆ ఆటవస్తువుల్లో ఏదో కొనబోయి ఠకీమని తన్ను తాను తెలుసుకుని ఆగిపోయాడు. ఆ పసిపాప చేతిలో ఏదో పెట్టాలని ప్రబలంగా అనిపించింది. ఆ ఊహకి అతనికి నవ్వు రాకపోలేదు.

తనూ కొనాలి; కొంటాడు—ఆటవస్తువులూ, అవీ ఇవీ.

ఏవి ?

ఆలోచిస్తున్నాడు రంగారావు.

చీరలూ, (రకరకాలవి).

ఫ్యాన్సీ సామాన్లూ, టాయిలెట్ సామగ్రీ, (కొత్త కొత్తవి) నగలూ, (మంచిమంచివి).

ఆటవస్తువులూ, చాక్లెట్లూ ఇంకా, ఇంకా ఎన్నెన్నో...

మందులూ, మందులు !!

భయంవేసింది రంగారావుకి. గబగబ ముందుకి నడిచాడు ఆ ఆలోచన మర్చిపోవాలని ప్రయత్నిస్తూ.

ఓ పెద్ద కాన్వాస్‌మీద ఓ కుటుంబం.

యజమాని చేతిలో ఇన్సురెన్స్ పాలిసీ.

"మీ కుటుంబం మీపై ఆధారపడియున్నది."

జీవిత భీమా !

జీవితం! భీమా !

మధురమైన ఆలోచన లన్నీ ఉప్పొంగి కాన్వాస్‌కి కొట్టుకుని శిథిలమయ్యాయి.

కొనుక్కోండి పాలిసీ.

కొనేవాడే రాజు. మగ మహారాజు. జీవితం కొని ఇచ్చేవాడు. అన్నీ కొని తెచ్చేవాడు.

చుట్టూ తిరిగి రంగారావు ఆలోచనలన్నీ మొదటికొచ్చాయి. మళ్ళీ జనంవైపూ, కొట్లవైపూ విచిత్రంగా చూడసాగాడు రంగారావు. ఆగిపోయిన వీణానాదపు ప్రతిధ్వని ఇంకా ఆగిపోలేదు. అది అస్పష్టంగా నేపథ్యంలో వినిపిస్తుండగా రంగారావు అప్పుడప్పుడు తాళం వేస్తూ ముందు ముందుకి పోతున్నాడు.

ఎవరో పాడుతున్నారు, వేలంపాట. జనం చుట్టూ మూగారు. వేలంవేసే ఆసామీ హడావిడి చేస్తున్నాడు.

"పది రూపాయలు...పది రూపాయలు ... ఒకటీ... రెండూ...రెండూ! మంచి తరుణం. ఆలోచించుకోండి. మించిపోవును. పది రూపాయలు. రెండు..."

రంగారావు జనంలో జొరబడ్డాడు. పక్కనే ఓ ముసలాయన ఆదుర్దాగా డబ్బు లెక్క చూసుకుంటున్నాడు. ఎన్నిసార్లు చూసుకుంటున్నా అంతే వొస్తోంది కాబోలు;

మళ్ళీ మళ్ళీ చూసుకుంటున్నాడు. మధ్య మధ్య వేలంవేసే ఆసామీవైపు చూస్తున్నాడు.

"బంగారంలాంటి సరుకు. షిఫాన్ సిల్కు. అతి చౌక. కారు చౌకగా పోతోంది. తరవాత విచారిస్తే లాభం లేదు. పది రూపాయలు..."

ముసలాయన నిస్పృహగా నుంచున్నాడు. ఆయన ముఖంలో దైన్యం తాండవిస్తోంది. రంగారావు చూశాడు ఆ ముఖ కవళికలు. పాపం! డబ్బు తక్కువైనట్టుంది. కూతురికి కొనిపెట్టాలని ఉబలాట పడుతున్నట్టున్నాడు. పేద వాడని వేరే చెప్పాలిసిన పనిలేదు. ముమ్మూర్తులా కుచేలుడే. అవతల ఆసామీ ఎవరో హుషారుగా ఉన్నాడు. రంగారావుకి ఆ ఉత్సాహం చూసి వొళ్ళు మండింది. ముసలాయన్ని పలకరించాడు.

"ఆ చీర కొంటా రేమిటి?"

ఆయన నిరాశగా "ప్చ్", అన్నాడు.

"పాడినట్టున్నారు".

"మన తాహతుకు దాటిపోయింది."

పది రూపాయలకి పాటపెంచిన ఆసామీ వీళ్ళిద్దరివైపూ చూస్తున్నాడు. ఆ చూపుల్లో ఏదో ఎగతాళి కనిపించింది రంగారావుకి. యువకరక్తం పొంగింది. కొనేవాడు మహా! ఎందుకా డాబు! ఎందుకేమిటి! కొనేవాడే రాజు! రాజు!

ఉన్నట్టుండి రంగారావు అరిచాడు. "పన్నెండు."

వేలంఆసామీ హుషారుగా కేకేశాడు. "పన్నెండు... క్లియరెన్స్ సేల్—చౌక చౌక... కారు చౌక..."

అవతల ఆసామీ తెల్లబోయాడు. తటపటాయించాడు. ఏదో అనబోయాడు. సంకోచించి ఆగాడు. మళ్ళీ ఏదో ప్రయత్నించసాగాడు. "రెండూ, రెండూ... మూడూ! తీసుకోండి."

కాలహరణం సహించని వేలంఆసామీ పన్నెండుకి పాటు ఫైసల్ చేశాడు. రంగారావు గర్వంగాచూశాడు. కోనేవాడు రంగారావు!

అయితే ఆ ఉత్సాహం విసురుగా చేతుల్లో చీర పడగానే ఒక్కసారిగా అణగారింది. తనేంచేశాడు! పన్నెండు రూపాయలు! తనేం చేసుకుంటాడు చీర? ఏం చేయాలని పాట పాడాడో అంతరాంతరాలు చెప్పినా రంగారావుకి ఏదోగా ఉంది. తెగించి డబ్బు అవతల పారేసి ముసలాయనతో జనంలోంచి బయటికొచ్చాడు. ముసలాయన దృష్టి అంతా చీరమీదే ఉంది.

"మీ రెంతవరకూ పాడారు?"

"ఎనిమిది"

"ఆ ఎనిమిది రూపాయలూ ఇచ్చి, ఈ చీర తీసుకుంటారా!"

ముసలాయన ఆశ్చర్యంగా చూశాడు.

"ఎందుకు? మీకు అక్కర్లేదా?"

"నాకెందుకు? బ్రహ్మచారిని."

కథా నిలయం
శ్రీకాకుళం

"అయితే ఎందుకు పాడారు?"

"చెప్పలేను."

"చిత్రంగా మాట్లాడుతున్నారే."

"చిత్ర మేమీ లేదు."

"చూస్తూ చూస్తూ నాలుగు రూపాయలు నష్టపడే వాళ్ళని నే నెక్కడా చూడలేదు."

"నన్ను చూశారుగా."

"అందుకే ఆశ్చర్యంగా ఉంది."

"మనుషులు ఆశ్చర్యకరంగానే ప్రవర్తిస్తారు. ఓ విధంగా నేనూ ఆశ్చర్యపడుతూనే ఉన్నాను."

"మీరు కేవలం నాకు సహాయం చెయ్యాలనే ఉద్దేశంతో వేలం పాడినట్టున్నారు."

"నా కంత ఔదార్యం ఉందని నే ననుకోను. ఆలోచిస్తే ఇలా చేసేవాడిని కాదేమో. కానీ మనం అన్ని పనులూ ఆలోచించి చెయ్యం చూడండి."

"మీరు తమాషాగా మాట్లాడుతున్నారు."

"ఇవాళ నేను చాలా మంచి 'మూడ్', లో ఉన్నా లెండి. ఇవాళే పరీక్షలైనాయి. అదీ కారణం."

ముసలాయన కొంచెం నవ్వాడు. రంగారావు వ్యవహారంలోకి దింపాడు. ఆయన మొహమాటపడ్డాడు. తీసుకోకపోతే తనకి నాలుగు రూపాయలేకాక పన్నెండూ దండగే నని రంగారావు నచ్చచెప్పిం తరవాత ఆయన తప్పనిసరిగా తీసుకున్నాడు. ఆ చీర తీసుకుంటున్నప్పుడు ఆయన సంతోషం

అంతా ఇంతా కాదు. ఆ సంతోషం చూసి రంగారావు కూడా హృదయపూర్వకంగా సంతోషించాడు—లోలోపల కొంత బెంగగా ఉన్నా. తను నాలుగు రూపాయలు పోగొట్టుకున్నాడు. కాని అది సద్వినియోగం అయినట్టేనని సమాధాన పరుచుకున్నాడు.

"మీ సహాయం మర్చిపోలేను. అమ్మాయికి ఒక్క మంచిచీర కొనిపెట్టాలని ఎన్నాళ్ళనించో ఎంతో ప్రయత్నించాను. కాని సాధ్యంకాలేదు. ఇవాళేదో అదృష్టవశాత్తూ చవగ్గా వొస్తుందని ఆశపడితే అది కాస్తా అడియాస అయే సమయంలో మీరు సహాయం చేశారు."

"ఇదికూడా ఓ గొప్ప సహాయంలా మాట్లాడకండి."

"ఎందుకు కాదు? ముక్కూ మొహం ఎరగనివాడికి ఎవరైనా ఇలా తోడుపడతారా? మీ అడ్రస్ చెప్పండి. ఈసారి ఫస్టుతారీకున మీ నాలుగు రూపాయలూ ఇచ్చేస్తాను."

"అబ్బే, ఎందుకులెండి. నేను అప్పుగా ఇవ్వలేదుగా. మారుబేరాని కిచ్చేశాను అంతే."

"ఇంత మంచి హృదయంగలవాడివి, నీ పేరేమిటి నాయనా?"

ఇలా అకస్మాత్‌గా ఏకవచనంలో పిలిచేసరికి రంగారావు కొంచెం తికమకపడ్డాడు. ఆ సంబోధనలోని ఆర్ద్రత, స్వరంలోని కంపనం అతన్ని కొంచెం కలవరపెట్టాయి.

"ఏకవచనంలో పిలిచా నని ఏమీ అనుకోకు. తండ్రి లాంటివాడిని, బహువచనంలో సంబోధించి గౌరవి స్తే ఆయుః క్షీణం అంటారు."

రంగారావు హృదయం కరిగింది.

"మీ ఇష్టంవొచ్చినట్టు పిలవొచ్చు. నాపేరు రంగా రావు."

"సంతోషం. ఏం చేస్తున్నావు నాయనా?"

"చెప్పాను కదూ? బి. ఏ., పరీక్ష ఆఖరి పేపరు ఇవాళే రాశాను."

"సంతోషం, బాబూ. తప్పక ప్యాసవుతావు. నీలాంటి సహృదయుల్ని నే నెంతోమందిని చూడలేదు. జీవితంలో నీలాంటివారి అండదండలే ఉంటే ఇన్ని కష్టా లనుభ వించేవాడిని కాదేమో."

రంగారావు ఆస క్తిగా అడిగాడు "జీవితంలో చాలా ఇబ్బందులు పడ్డట్టున్నారు."

ఆయన చిన్నగా నవ్వాడు. "అవును కాని వాటిని గురించి నే నెప్పుడూ విచారించను. అయినవాళ్ళని కాదని, లోకాన్ని ఎదిరించి వర్ణాంతరం, అందులో వితంతువివాహం చేసుకోకపోతే ఇన్ని కష్టాలు ఉండేవికావేమో. కాని తృప్తి కూడా ఉండేదికాదు. నాకు జీవితంలో ఇప్పుడు మిగిలిందల్లా అదొక్క సుఖమే. ఇప్పుడు అమ్మాయి తప్ప నా అనేవాళ్లెవరూ నాకు లేరు. పిచ్చిపిల్ల."

ముసలాయన విషాదంగా, ముసిముసిగా నవ్వుకోటం ఎందుకో రంగారావుకి సరిగా అర్థంకాలేదు.

"నేనంటే ఎంత ప్రేమ! నేను సాయంత్రం బడినించి— నేను ఎలిమెంటరీస్కూల్ టీచర్నిలే నాయనా; వేషంచూసి కనిపెట్టే ఉంటావు—ఏం చెబుతున్నానూ? ఆఁ... నేను బడి నించి వొచ్చేదాకా తనుకూడా కాఫీ తాగకుండా నాకోసం చూస్తూనే ఉంటుంది. పాపం. ఇవాళ ఎంతో ఆలస్యమైంది. నాలుగింటికే పోయేవాడిని. ఆపనీ ఈపనీ తగిలి ఆగిపోయాను. ఇంతలో ఈ వేలంవెర్రిలో పడ్డాను. షిఫాన్‌సిల్కు! పిచ్చి పిల్ల ఎంత సంతోషిస్తుందో! డబ్బే ఉంటే! ఎందుకులే, ప్చ అమ్మాయిదే దిగులు."

రానురాను ఆయన అర్ధస్వగతంగా మాట్లాడటంతో రంగారావు సంభాషణలో ఏమీ కలగచేసుకోకుండా ఊరికే వినసాగాడు. సంజచీకటి పడుతోంది. ముసలాయన ఓ చిన్న పూరింటి గుమ్మంముందు ఆగి "ఓసారి లోపలికొచ్చి కూచుని పో బాబూ" అని ప్రార్థనాపూర్వకంగా రంగారావుతో అని తలుపుతట్టాడు.

తలుపు తెరుచుకుంది.

మెరుపు మెరిసింది; కాదు, చుక్క తళుక్కుమంది; కాదు. ఓ అమ్మాయి కనిపించింది. ఆ అమ్మాయి రంగా రావు అనే ఒకానొక వ్యక్తి ఆ సమయంలో ప్రత్యక్షమవుతా డని ఏకోశానా అనుకోలేదు. అనుకుంటే చాటుగా దాగే దేమో. పారిపోయేదేమో. కాని ప్రస్తుతం బెదిరి రంగారావు

కళ్ళలోకి సూటిగా చూసింది క్షణం. తరవాత జరిగింది తెలిసి, సిగ్గుపడి చివాలున లోపలకి వెళ్ళిపోయింది.

రెండూ, రెండూ నాలుగు కళ్ళూ కలిసిన క్షణంలో రంగారావు శక్తిని యావత్తూ ఏదో అయస్కాంతశక్తి ఆకర్షించి రంగారావుని బొమ్మలా, శిలావిగ్రహంలా నుంచో పెట్టింది.

ముసలాయన హెచ్చరిక విని తేరుకున్నాడు రంగారావు.

"ఆ కుర్చీ ఇలా వెయ్యమ్మా, శారదా!"

శారద!

"శారద నీరదేందు ఘనసార పటీర మరాళ మల్లికా.."
బి. ఏ., పార్టు టూలోని పద్యం గ్రిరున రికార్డులా రంగారావు మనసులో తిరిగింది.

యాంత్రికంగా ఆ పాతకుర్చీలో కూలబడ్డాడు రంగారావు.

"కాఫీ ఉందామ్మా?"

"ఊఁ. తెస్తున్నా"

ఆ సన్నటి స్వరంలోనే సంగీతశాస్త్రమంతా ఇమిడి ఉందనిపించింది రంగారావుకి.

కాఫీకప్పు కింద—తన దగ్గరగా—శారద పెట్టినప్పుడు విల్లులా వంగిన ఆ మృదుల తనూలతని మనసులో ఫోటోగ్రాపు చేశాడు రంగారావు.

ముసలాయన ఏదో మాట్లాడుతున్నాడు. తను వింటు న్నాడు కానీ వినటంలేదు. అమ్మాయితో తన విషయం

చెప్పినట్టు చూచాయగా అతనికి తెలిసింది. అప్రయత్నంగా ఆమెవైపు చూశాడు.

మళ్ళీ ... నాలుగుకళ్ళూ !

రంగారావు హృదయంలో ఎవరో వీణ మీటుతున్నారు. వీణ మీటేదెవరు ? ప్రశ్నించుకున్నాడు రంగారావు. "శారద కదూ?" అప్రయత్నంగా జవాబిచ్చింది అతని హృదయం — పోనీ, మనసు.

ధ్వనితరంగాలు — ఆనందతరంగాలు ! వాటిమీద తేలిపోతూ రంగారావు !

ముసలాయన దగ్గర సెలవు తీసుకొని రంగారావు వీధిలో ప్రవేశించి ముందుకు నడుస్తూ వెనక్కి చూస్తూ సందు తిరిగి ఎలాగో రూమ్‌కి చేరుకున్నాడు. క్షణాలూ, నిమిషాలూ గడిచిపోతున్నాయి.

గదిలో క్యారియర్ ఎదురు చూస్తోంది. ఆ విషయం ఎప్పుడో ఓసారి జ్ఞాపకంవొచ్చి టైంచూసి ఉలిక్కిపడి ఆ ముక్క తీర్చుకుని పడుకుని మళ్ళీ ఆలోచనాసాగరంలో పూర్తిగా మునిగిపోయాడు రంగారావు.

"తనూ ఎప్పుడో కొనాలి; కొంటాడు—"

కొంటాడేమిటి ! కొన్నాడు ! బి. ఏ., ఆఖరి పరీక్ష రాసేసిన రోజే — ఆ సాయంత్రమే.

ఐపోయాయి పరీక్షలు. వదిలింది భారం.

మధుర మధురమైన జీవితం. ముందున్నదంతా అదే.

ఆ చూపు ! కళ్ళల్లోంచి ప్రవహించే ఆ విద్యుత్తు.

అవి చూపులు కావు. తూపులు. కళ్ళలోంచి దూసుకుపోయి గుండెల్లో గుచ్చుకుని హృదయాన్ని గాయ పరిచాయి.

ఖటావ్ వాయిల్స మనసులో మెదిలాయి రంగా రావుకి.

షిఫాన్ సిల్క్ ! మధురస్మృతి.

కోనేవాడు రంగారావు కొన్నాడు. కొనేవాడే రాజు. రంగారావు రాజు. రాజాధిరాజు.

రోడ్డుమీద పోయే జనం 'రూల్స', అతిక్రమించి రంగారావు మనసులో జొరబడ్డారు.

రంగారావు హృదయంలో ఏదో బాధ.

పుష్పబాణవిలాసం కాదు. రంగారావుకి అదే ఆలోచించాలని ఉంది. కాని మనసేదో ఆలోచిస్తోంది. రెండూ స్థలంకోసం పోటీ పడుతున్నాయి. ఆ విషయం అత నికి చప్పున తెలిసిపోయింది.

పోటీ ! పోటీ !! తనలోకూడా ఏదో పోటీ ! తనకి కూడా పోటీ తప్పదు !

బి. ఏ., ప్యాస్ కాగానే ఉద్యోగానికి పోటీ. ఫస్టుక్లాస్, సెకండ్ క్లాస్ ... పోటీదారులు. తనకు ఆర్డినరీపాస్ కంటే రాదు. అలా అయితే ఉద్యోగం .. రాదా? రాకపోతే? డబ్బుండదు. ఉండకపోతే! కొనలేడు, ఏవీ —

రంగారావుకి ముచ్చెమటలు పోశాయి.

ఇన్సరెన్స బొమ్మ కనిపిస్తోంది.

జీవితం ! భీమా !

కుటుంబాన్ని అన్యాయం చెయ్యకండి ! భీమా చెయ్యండి. ఉత్తమోత్తమమైన భీమా కుటుంబం లేకపోవడమే!

ఎందుకో వెంటనే అలా అనిపించింది రంగారావుకి.

కాఫీ తాగలేని ఎలిమెంటరీ టీచర్; సిగరెట్ కొనలేని ఎన్. జి. ఓ.; చీర కొనలేని పెద్దమనిషీ జాలిగా రంగారావు వైపు చూస్తున్నారు.

జీవితం వాళ్ళని మోసగిస్తోంది. ఘోరం.

జీవితం! రంగురంగుల బోర్డులన్నీ పరస్పరం ద్వేషించు కుంటూ ఈర్ష్యగా చూస్తున్నాయి. పోటీ పడుతున్నాయి.

"రండి రండి, రాజులూ...ఏరీ, ఏరీ ?"

"కావాలి, కావాలి...ఎలా, ఎలా ?"

ఏం కావాలి ? ఎన్నో కావాలి ! ఇంకా ఎన్నో !! అదే జీవితం.

అవసరాలు.

సుఖాలు.

విలాసాలు !

ఇవన్నీ కలిస్తే జీవితం. వాటికోసం పోటీపడటమే జీవిత పోరాటం. అతిరథ మహారథులే, రాజాధి రాజులూ మర్తాండ తేజులూ. యోధానుయోధులకే రాజయోగం.

రంగారావు కింకో ఊహ తట్టింది.

బతికేవాళ్ళందరూ యోధానయోధులే. అతిరథ మహారథులు కాకపోవొచ్చు.

వేలంపాటలో చిత్తయిన ముసలాయన కనిపించాడు రంగారావుకి. అంతే, అంతే! అందరూ! ఆ రోజున ఆయన—తరవాత మరొకరు—ఒకొ్కక్కరూ! ఎప్పుడో తనూ...!

భయం వేసింది రంగారావుకి.

జీవితాన్ని కాలసర్పం కాటు వేస్తోంది! లాభంలేదు. కాలాన్ని నిర్లక్ష్యంచేసి ఏమరుపాటుగా ప్రవర్తిస్తే జీవితం ఆఖరు.

నేడు పుష్పబాణ విలాసానికి వశమైతే, రేపు?

కోనలేనివాడు ఉండీ లేనివాడు. జీవన్మృతుడు.

రాజుని చూసిన కళ్ళతో మొగుణ్ణిచూస్తే మొత్త బుద్ధిపుడుతుంది!

రంగారావు మనసులో ఈ ఆలోచన బాణంలా గుచ్చుకుంది. అతని ముఖం చిన్నబోయింది. తనని పైకి రానీయదు ప్రపంచం. తనని లక్ష్యపెట్టరు ఎవరూ, ఆ అమ్మాయి కూడా.

రంగారావు నిస్పృహగా, ఆలోచించటం మానేశాడు. కళ్లు మూసుకున్నాడు. నిద్ర రావటంలేదు. ఎలా వొస్తుంది నిద్ర? తనకి నిద్ర రాదు! ఆశలన్నీ అడియాసలయాయి. మళ్లీ ఆలోచనలు.

ఆ అమ్మాయి, శారద—పాపం—నిస్సహాయురాలు. ఆ చూపులో ఏదో ఉంది. ఆ అమాయకత్వంలో ఏదో అయస్కాంతశక్తి ఉంది. కాంతత్వంతో కాంతత్వం కలిగించ

వచ్చు. అలా తనవైపే చూస్తే, తన నేత్రాలుకూడా అయస్కాంతాల్లా—

రంగారావు హృదయం జల్లుమంది. శరీరం గగుర్పొడిచింది. కాని, కాని...అయ్యో! తను నిస్సహాయుడేనా? చేతకానివాడేనా? ఏం చెయ్యగలడు? డబ్బే ఉంటే, ఈ క్షణంలో ఆమె దగ్గరవాలి...ఎందుకు దంభోక్తులు! డబ్బు లేకుండా దాన్ని గురించి ఆలోచించటం అనవసరం. జీవితం ఇలా అడవిగాచిన వెన్నెలలా ఐపోవలసిందేనా? ఆమె సంగతేమిటి? పాపం, ఆ బీద ఎలిమెంటరీటీచర్ ఆమెకి మంచి మొగుణ్ణి ఎక్కడ కొనితేగలడు? ఆమెగతి అంతేనా, పాపం! తనూ, బీదవాడే! ఏం చెయ్యగలడు? ఆమె కసలు వివాహం కాదేమో! ఎన్నో చిక్కులు. తనకీ కాదు. తను జీవితంనుంచి పారిపోతున్నాడా?

రంగారావుకి కోపంవొచ్చింది, తనమీందే. తనెక్కడికీ పారిపోవటంలేదు. హాయిగా మంచంమీద పడుకుని నిద్రపట్టక తన్నుకుంటున్నాడు! కళ్లు మూసుకున్నాడతను. నిద్ర రాదు. ఆలోచనలు, క్షణాలూ, నిమిషాలూ, గంటలూ గడిచి పోతున్నాయి. టైమెంతయిందో? ఎంతయితే ఏం?

చివాలున మంచంమీదనుంచి లేచి తలుపు తీశాడు రంగారావు. చీకటిగా ఉంది. అలా చల్లగాలికి తిరిగితే నిద్ర పడుతుందేమో! తలుపు దగ్గరగా వేసి ఆ చీకట్లోనే బయలుదేరాడు. రోడ్డంతా నిర్మానుష్యంగా ఉంది.

ఆలోచిస్తూ, మానేస్తూ, నడుస్తూ, ఆగుతూ తిరుగుతున్న రంగారావుకి ఆ చీకట్లో గట్టిగా ఓ ఎదురుదెబ్బ తగిలి

‘అబ్బా’, అని రోడ్డుమీద కూలబడిపోయాడు. వేలికి కంకర్రాయి తగిలి నెత్తురు వస్తున్నట్టుంది. చెయ్యి తడి అయింది! దిమ్మరబోయి కాసేపు ఆ వేలుపట్టుకుని అలాగే కూచున్నాడు. ఆ అవస్థలో అతనికి శారద జ్ఞాపకం వొచ్చింది. అలా తన వేలినించి రక్తం వస్తుంటే ఆమె ఏం చేసేదో! ఆమె కట్టుకున్న షిఫాన్ సిల్కు చీర బోర్డర్ చింపి తన వేలుకి..! ఎవరో తన హృదయంలో వీణ మీటుతున్నారు – మధుర మధురంగా.

నెమ్మదిగా లేచి నుంచుని రూమ్‌కి వెళ్ళటానికి వెనక్కి తిరిగి అడుగులో అడుగు వేస్తూ రంగారావు యాదాలాపంగా ఆకాశంలోకి చూశాడు. ఆ నీలాకాశంలో ఉజ్జ్వలంగా తెల్లటి చుక్క ధవళకాంతులు విరజిమ్ముతూ మెరుస్తోంది! వేగు చుక్క పొడిచింది.

విస్ఫారిత నేత్రాలతో తదేకంగా చూడసాగాడు రంగారావు. విరిసిన మల్లెమొగ్గ. సూర్యుణ్ణి చిదిమి పెట్టిన దీపం. ఎర్రటి పెదవుల్లో మొలకెత్తిన చిరునవ్వు. అందాలన్నిటినీ చిలికి వెలికి తీసిన పుష్యరాగం...

ఎన్ని పోలికలు వెతికినా రంగారావుకి తృప్తికలగలేదు! అలాంటి అందాన్ని తనెప్పుడో, ఎక్కడో తప్పక చూశాడు. దిగంతాల కివతలే! చూసినప్పుడు గుర్తించాడో, లేదో, కాని లీలగా చిరపరిచితంగా ఏదో దృశ్యం మనసులో మెదుల్తోంది. అతను కళ్ళుమూసుకుని మనస్సులో అన్వేషణ సాగించాడు. చప్పున ఏదో భావకిరణం మెరిసి తలెత్తి ఆకాశంలోకి చూశాడు.

వేగుచుక్క పరిచితంగా మరోసారి తళుక్కుని పలక రించింది — తెలిసోగకళ్ళతో.

సౌందర్యానికి ఖరీదుకట్టే షరాబులాగా అత నలాగే ఆ తెల్లటి చుక్కవైపుచూస్తూ నిలబడిపోయాడు.